క్లుప్తంగా

హెచ్ఎంకు సన్మానం..



హెచ్ఎం రవిని సన్మానిస్తున్న కలెక్టర్ పాటిల్

ఇల్లెందురూరల్: జిల్లా స్థాయి బాలమేళాకు ఎంపికైన ముత్తారపుకట్ట పాఠశాలను ప్రశంసిస్తూ హెచ్ఎం కబ్బాకుల రవిని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మంగళవారం కొత్తగూడెంలో ఘనంగా సన్మానించారు. కాంప్లెక్స్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులు, ఆ దిశగా వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందనీయులని కలెక్టర్ ప్రశంసించారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరచారి, ఏఎంఓ నాగరాజశేఖర్, ఎంఈఓ స్వామి పాల్గొన్నారు.

ఎస్ఐ సందీప్‌కుమార్‌కు..



సందీప్‌కుమార్‌ను అభినందిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ఇల్లెందు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సందీప్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.చంద్రభాను శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఆయన గ్రూపు–1లో 502 మార్కులు సాధించారు. త్వరలో డీఎస్పీ, ఆర్డీఓ స్థాయి ఉద్యోగంలో చేరే అవకాశం ఉందని, సందీప్‌కుమార్ ఎందరికో ఆదర్శంగా నిలిచాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

జీకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌కు...



రమేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సింగరేణి (కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి గౌతంఖని ఓపెన్‌కాస్టు (జీకే ఓసీ) ప్రాజెక్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్ డీవై జీఎంగా పదోన్నతి పొందారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు జీకే ఓసీ పిట్ సెక్రటరీ ఆధ్వర్యంలో వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, కమిటీ సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపు కుమారస్వామి, విప్లవరెడ్డి, భీముడు, పోషం శ్రీనివాస్, కుమార్, దుర్గాసింగ్, గణేష్, సీహెచ్ శ్రీధర్, ఏ.శ్రీధర్ పాల్గొన్నారు..

సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలికి...



రమను సత్కరిస్తున్న సమితి సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందు సింగరేణి సేవా సమితి సభ్యులు మేకప్ అండ్ నైల్ ఆర్టిస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన సభ్యులకు శిక్షణ ఇప్పించినందుకు ఇల్లెందు సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు వీసం రమను ఘనంగా సత్కరించారు. మంగళవారం కొత్తగూడెంలోని గ్రేస్ మేకప్ అకాడమీ అండ్ హర్షిత్ నైల్ ఆర్టిస్ట్ ఆధ్వర్యంలో మేకప్ అండ్ నెయిల్ ఆర్ట్ సెమినార్ జరిగింది. హాజరైన సభ్యులు వివిధ రంగాల్లో శిక్షణ పొంది తమ ప్రతిభను చాటుకున్నారు.

హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా శ్రీలత ఎంపిక

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీలత సోమవారం విడుదలైన ఫలితాలలో హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా ఎంపిక అయ్యారు. ఫలితాలలో గ్రేడ్–2గా, ర్యాంకు –224 సాధించారు.

ఎస్‌బీఐ లైఫ్‌ని ఆదరించండి..

కొత్తగూడెంఅర్బన్: ఎస్‌బీఐ లైఫ్ పాలసీని ఆదరించి కుటుంబానికి అండగా నిలవాలని బ్యాంకు ఆర్ఎం సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎస్‌బీఐ పోస్టాఫీసు బ్రాంచిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి రూ.20 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలు ఇచ్చేనా?

- మూడేళ్లుగా ఊసేలేదు
- గతంలో మంజూరైన రుణాలకు సబ్సిడీ కూడా కరువే..



ఎంపీడీఓ కార్యాలయం

పాల్వంచరూరల్: గిరిజనులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం తెలంగాణ షెడ్యూల్డ్ గిరిజన కోఆపరేటివ్ (ట్రైకార్) నిధులను రుణాలు మంజూరు చేసేది. మూడేళ్లుగా ఆ రుణాల ఊసే లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ప్రతీ సంవత్సరం చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం 90శాతం సబ్సిడీతో ట్రైకార్ రుణాలు మంజూరయ్యేవి. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలంలో 2020–21లో ట్రైకార్ రుణాల కోసం 786 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 300 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారు. 56 యూనిట్లకు రూ.46.34 లక్షలు రుణాలు మంజూరు కాగా వాటిని 56 మందికి మంజూరు చేశారు. 2021–22లో 50 మంది దరఖాస్తు లు చేసుకోగా 35మందికి మంజూరు చేశారు. 2022లో ట్రైకార్ రుణాల కోసం 400 మంది దరఖాస్తు చేసుకోగా ఒక్కరికి కూడా మంజూరు కాలేదు. అదేవిధంగా గతంలో మంజూరైన రుణాలకు కూడా ఇంత వరకు సబ్సిడీ కూడా ఇవ్వలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన లబ్ధిదారులకు బ్యాంకర్లు కూడా రుణాలు ఇవ్వలేదంటున్నారు.

ఈఎస్ఎస్ రుణాలు కూడా మంజూరు కావడం లేదు..

ప్రతీ ఆర్థిక సంవత్సరంలో గిరిజనులకు స్వయం ఉపాధి కింద (ఎకానమికల్ సపోర్టు స్కీమ్) ఈఎస్ఎస్ కింద అనేక రకాల స్కీమ్‌ల ద్వారా యూనిట్లను మంజూరు చేసేవారు.

దానిలో అర్హులైన గిరిజన లబ్ధిదారులకు యూనిట్లను గ్రౌండింగ్ చేయాల్సి ఉండగా నాలుగు సంవత్సరాలుగా ఇప్పటి వరకు యూనిట్లు మంజూరు చేయలేదని పలువురు గిరిజన లబ్ధిదారులు చెబుతున్నారు.

రుణాల మంజూరు వివరాలు

సంవత్సరం	దరఖాస్తులు	మంజూరైనవి
2020–21	786	300
2021–22	50	35
2022–23	400	0

సబ్సిడీ ఇవ్వండి..



ట్రైకార్ రుణం కోసం 2020–2021లో పేపర్ కటింగ్ మిషన్ యూనిట్ కోసం దరఖాస్తు చేసుకుంటే రుణం మంజూరు చేశారు. సబ్సిడీ ఇంత వరకు ఇవ్వలేదు. సబ్సిడీ కోసం మూడు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నా ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రైకార్ రుణాల సబ్సిడీని వెంటనే అందజేయాలి.

– బానోతు దుర్గ, బిక్కు తండా

ఉన్నతాధికారులు స్పందించాలి...



ప్రతీ సంవత్సరం ట్రైకార్ రుణాలను మంజూరు చేసేవిధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఐటీడీఏ ట్రైకార్ రుణాలు అందించాలి. రూ.2 లక్షల వ్యయంతో సెంట్రింగ్ యూనిట్ కోసం ట్రైకార్ రుణం మంజూరు కాగా చెక్కు వచ్చింది. ఇప్పటి డబ్బులు రాలేదు.

– బానోతు రాజేందర్, పాండురంగాపురం తండా

ప్రతిపాదనలు పంపించాం..



ట్రైకార్ రుణాల కోసం గిరిజనులు ప్రతీ సంవత్సరం దరఖాస్తు చేసుకుంటున్నారు. మూడేళ్లుగా ఐటీడీఏ నుంచి ట్రైకార్ రుణాలు మంజూరు కావడం లేదు. రుణాల మంజూరుకు ప్రతిపాదనలు కూడా పంపించాము. ఐటీడీఏ ద్వారా నిధులను ఎప్పుడు మంజూరు చేస్తే అప్పుడు అర్హులైన గిరిజలకు రుణాలు అందజేస్తాం.

– కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ

డైరెక్టర్లు లేక పరిష్కారం కాని సమస్యలు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకాలు లేకపోవడంతో ఉద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (1535) రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ.వజీర్ అన్నారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం యూనియన్ 27వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వజీర్ మాట్లాడుతూ... యూనియన్ స్థాపించిన నాటి నుంచి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ, పుట్టా నాగేశ్వరరావు, జెన్కో అధ్యక్షుడు పి.రాము, డి.శంకర్ మణి, గంజి సతీష్, అక్కెనపల్లి వెంకటేశ్వర్లు, వి.ధనయ్య, బాలాజీనాయక్, పుల్లారావు, డి.నాగేశ్వరరావు, వెలిదండ ప్రసాద్ పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై అవగాహన

పాల్వంచ: గ్లౌకోమా (నీటి కాసులు) వ్యాధి కంటి చూపునకు సంబంధించిన వ్యాధి అని, దీనిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత త్వరగా నిర్మూలించవచ్చని హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి డాక్టర్ సిద్ధార్థ దీక్షిత్ అన్నారు. స్థానిక నవభారత్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో కంటి వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. అడ్మినిస్ట్రేటివ్ దేవీచందర్‌రావు, డాక్టర్లు శ్వేత, దివ్య త్రిపాఠి, కిరణ్మయి, హారిక, అనుప్రియ, సాయితేజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్ధార్థ దీక్షిత్

'రాజీవ్ యువ వికాసం' పాతదే..

పాల్వంచ: ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో ప్రవేశపెట్టిన పథకం పాతదేనని, కొత్తగా చిత్రీకరిస్తున్నారని బీఆర్ఎస్‌వీ పట్టణ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలో బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో రామారావు, గౌతమ్, పవన్, సోను, వలి పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే..

సుజాతనగర్: చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమేనని మండల విద్యాశిఖాధికారిణి ఎల్.లీల అన్నారు. గరీబ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం, మండల విద్యాశాఖాధికారిణి ఎల్.లీల మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మైదానంలో ప్రతీరోజు ఒక గంట క్రీడలకు సమయం కేటాయించాలని మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉన్నవారే చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. భవిష్యత్‌లో ఉద్యోగ నియామకాల్లో, ఉన్నత చదువుల్లో క్రీడా రిజర్వేషన్లు కూడా వినియోగించుకోవాలన్నారు. దేశవిదేశాల్లో క్రీడారంగంలో అత్యున్నత స్థాయికి వెళ్లిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. షేక్ దస్తగిరి, బిక్కులాల్, వెంకట్రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి



ఇల్లెందురూరల్: ఉపాధ్యాయులతో విద్యార్థులు



జూలూరుపాడు: మాట్లాడుతున్న ఎస్సై రవి

ఇల్లెందురూరల్: ప్రతీ విద్యార్థి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని కొమరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ ఆకాంక్షించారు. మంగళవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి జీవితంలో పాఠశాల విద్య మధురస్మృతిగా ఉంటుందని, ఇక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, నైతికతను భవిష్యత్‌లోనూ కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉన్నత తరగతుల్లో విద్యార్థి స్వయం ఆసక్తితో చదువుకోవాల్సి ఉంటుందని, ఈ ప్రయాణంలో ఏకాగ్రతను వీడకూడదని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జూలూరుపాడు: ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ఎస్సై రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో వార్షిక పరీక్షల్లో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, చైర్మన్ మందా స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ అర్హత పరీక్ష

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో మంగళవారం స్పోర్ట్స్ స్కూల్ అర్హత పరీక్ష నిర్వహించారు. బాలికలకు కాచనపల్లి, బాలురకు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో అర్హత కోసం నిర్వహించిన పోటీలలో ఇల్లెందు ఏటీడీఓ పరిధిలోని వివిధ ఆశ్రమ పాఠశాలల నుంచి 96 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిబంధనలకు అనుగుణంగా వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి తుది జాబితాను ఆయా స్పోర్ట్స్ స్కూల్‌లకు పంపారు. కార్యక్రమంలో ఏటీడీఓ సూర్నపాక రాధ, హెచ్ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

టేకులపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు, వ్యాపారులు, గృహిణులు, యువతీ, యువకులు అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలో సైబర్ నేరాలపై స్థానికులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరస్తులు వివిధ పేర్లతో ఫోన్లు చేసి రకరకాలుగా మభ్యపెట్టి మోసాలకు పాల్పడుతుంటారని, తెలియని నంబర్ల నుంచి ఫోన్లు వస్తే స్పందించొద్దని, ఏదైనా అనుమానం వస్తే స్థానిక పోలీసులకు కానీ, డయల్ 100కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి పూర్తి వివరాలు చెప్పాలన్నారు. టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐ పోగుల సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నాం..

పాల్వంచ: బీసీల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సింధు తపస్వీ అన్నారు. మంగళవారం ఆమె హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కవిత మొదట బీసీల ఉద్యమం మొదలు పెట్టి రాష్ట్ర మంతటా పర్యటించి బీసీ రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఓబీసీలు 56.36 శాతం ఉంటే 42శాతం మాత్రమే రిజర్వేషన్ అమలు చేయడం సరైంది కాదన్నారు. మళ్లీ బీసీలు కొట్లాడే పరిస్థితి వస్తుందని, ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. అదేవిధంగా రాజకీయ బిల్లు కూడా ప్రవేశ పెట్టాలన్నారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

పాల్వంచరూరల్: జగన్నాథపురం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ కమిటీ సభ్యులు బాదర్ల జ్యోషి, నాయకులు చికటి కార్తీక్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరామ్మూర్తి, స్థానికులు బానోతు బాలాజీ నాయక్, ధర్మపురి ప్రసాద్, కామరాజు, తిప్పిరెడ్డి, లచ్చిరెడ్డి, బానోతు కుమార్, భూక్యా ప్రసాద్, పవన్, నరేష్, బాబూరావు పాల్గొన్నారు.

ఉల్వనూరులో.. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రత్యేకాధికారి తాండ్ర మధుకర్ పరీక్ష ప్యాడ్లు అందజేశారు. మాట్లాడుతూ... విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం.వి జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై దృష్టి పెట్టండి..



హుస్సేన్‌నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: సింగరేణిలో గిరిజన ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంగోతు భాస్కర్‌రావు, భూక్యా నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం అశ్వారావుపేటలోని పామాయిల్ గెస్ట్ హౌస్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ని సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి, టేకులపల్లి మండలం కోయగూడెం ఓపెన్‌కాస్టు ఉద్యోగి భూక్యా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సింగరేణిలో గిరిజన ఉద్యోగస్తుల పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా వెంకటరామ్, అంతోటి నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంఓగా కంపెనీ వైద్యులే కొనసాగుతారు..

సింగరేణి(కొత్తగూడెం): సీఎంఓగా కంపెనీ వైద్యులే కొనసాగుతారని సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏఐ)కి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. మంగళవారం సంఘం నాయకులు భట్టి కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సింగరేణి ప్రైవేటీకరణ, కొత్త బ్లాకుల కోసం యాజమాన్యం, ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ప్రధానంగా సింగరేణిలో 42 వేల మంది ఉద్యోగుల వైద్య సేవల బాధ్యతలు నిర్వర్తించే ముఖ్య వైద్యాధికారి (చీఫ్ మెడికల్ ఆఫీసర్) పోస్టులో సంస్థలో పనిచేస్తున్న వైద్యాధికారులే కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. 136 సంవత్సరాల ఘన చరిత్ర కలిగి, తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద సంస్థగా విరాజిల్లుతున్న సింగరేణి రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లోనూ విస్తరించేందుకు యాజమాన్యం అనేక కార్యక్రమాలు చేపడుతుందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ వారిని సంస్థ ఉన్నతస్థాయి అధికారులుగా నియమించటం సరైంది కాదన్నారు.

హామీల అమలుకు కృషి చేస్తున్నాం..



మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: డిపెండెంట్ ఉద్యోగాల వయోపరిమితి పెంపు ఘనత ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌దేనని ఆ సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, ఇల్లెందు బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఏరియా వర్క్‌షాప్, సీహెచ్‌పీ, ఏరియా స్టోర్ డిపార్ట్‌మెంట్ల సంయుక్త గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సింగరేణిలో తక్షణం నూతన గనుల నిర్మాణం ఎంతో అవసరం అన్నారు. ఈ విషయమై యాజమాన్యంతో చర్చించినట్లు తెలిపారు. కార్మికుల సొంత ఇంటి కల రూ.10 లక్షల వడ్డీ రుణాలు కోసం యాజమాన్యంతో చర్చించామన్నారు. డిపెండెంట్ కాల పరిమితి 40 ఏళ్లకు పెంచినట్లు చెప్పారు. టెక్నీషియన్లకు మైనింగ్ సూపర్‌వైజర్లకు సర్వీస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వటం, గతంలో మైనింగ్ సర్టిఫికెట్ ఆలస్యం కావటం వల్ల ఉద్యోగాలు పోయిన జేఎంఈటీలకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. ఎన్నికల ముందు గుర్తింపు సంఘంగా గెలిపిస్తే పలు హామీలు నేరవేరుస్తామని హామీ ఇచ్చిన తాము వాటి అమలుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో దాసరి రాజారామ్, కొరిమి సుందర్, జక్కుల శ్రీనివాస్, మంగపతిరావు, దాట్ల శ్రీకాంత్, విజయ్, శ్రీనివాస్, రంజిత్, వెంకటరెడ్డి, హేమంత్‌కుమార్, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గంలో భాగస్వామ్యం కల్పించండి..

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ పాలకవర్గంలో స్థానికులైన కేశవాపురం, జగన్నాథపురం గ్రామాలకు చెందిన వారికి భాగస్వామ్యం కల్పించాలని కోరుతూ మంగళవారం ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారిని రెండు గ్రామాలకు చెందిన పలువురు వినతిపత్రం అందజేశారు. రెండు గ్రామాల ప్రజల సహకారంతో 1965లో అమ్మవారి ఆలయాన్ని ఏర్పాటు చేసుకుని 60 సంవత్సరాలుగా పూజిస్తున్నట్లు చెప్పారు. గంధం నర్సింహారావు, బాదర్ల నాగేశ్వరరావు, కొండం వెంకన్న, రవి, గంధం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గిట్టుబాటు ధరలకు చట్టం చేయాలి



మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచరూరల్: కేంద్ర ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరల చట్టాన్ని అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవనంలో మంగళవారం జిల్లా జనరల్ బాడీ సమావేశ సన్నాహక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. రైతులు అష్టకష్టాలు పడి అప్పులు చేసి ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాక, చేసిన అప్పులు తీరక ప్రతీ సంవత్సరం నష్టాల ఊబిలో కూరకపోతున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రైతుల పండించే ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. నేడు పెద్దమ్మగుడి సమీపంలోని ముంతాజ్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న రైతు సంఘం జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, కొంగర అప్పారావు, రంజిత్, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావ్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఎస్సీలపై వివక్ష వీడాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల అభివృద్ధిపై వివక్షకు వీడాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట రెండోరోజు రిలే నిరాహార దీక్షను మంగళవారం కొనసాగించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, జాతీయ బీసీ సంఘం జిల్లా నాయకుడు భూపతి అప్పారావు, మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకుడు మోదుగు జోగారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, రజిని అంబేద్కర్, ఎనగంటి కృపాకర్, బోడ ముత్తయ్య, వల్లపాక నాగేశ్వరరావు, రాసమల్ల నర్సయ్య, చాపలమడుగు రామరాజు, ఉండేటి దేవరాజు, ఎనగంటి శ్రీను, జెరాంబాబు, గోవర్ధన్, జాడి కిరణ్, బొమ్మెర రాములు, మిరియాల ఈశ్వరమ్మ, బొమ్మెర నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనుమతి లేని ఇళ్లను తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: తిలక్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా గిరిజనేతరులు నిర్మిస్తున్న ఇళ్లను తొలగించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మంగళవారం తిలక్‌నగర్ పంచాయతీ కార్యదర్శి నీలిమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు ఊకే చైతన్య, మండల అధ్యక్షుడు చింత ఉపేందర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా కొంతమంది వలస గిరిజనేతరులు ఇళ్లు నిర్మిస్తున్నారని చెప్పారు. పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇళ్లను తక్షణమే కూల్చివేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాంచంద్రు, సూర్నపాక రాకేష్, మోకాళ్ల మధు, ఊకే రామకృష్ణ, పూనెం శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.